క్లుప్తంగా

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించండి



డ్రై డే గురించి అవగాహన కల్పిస్తున్న జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు

పులివెందుల రూరల్ : ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం పులివెందుల అర్బన్ పరిధిలోని ఎర్రగుడిపల్లెలో డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మలేరియా, డెంగీ, మెదడువాపు వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. లార్వా దోమగా మారకముందే నీటి తొట్లు, బాణలు, డ్రమ్ముల్లో ఉన్న నీటిని పారబోయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి ఖాజామొయిద్దీన్, జిల్లా గణాంకాధికారి రమేష్‌రెడ్డి, వైద్యులు శాంతికుమార్, సబ్‌యూనిట్ అధికారులు సిద్దయ్య, సతీష్‌కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్ అవినాష్‌రెడ్డి వేంపల్లెకు రాక

వేంపల్లె : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నేడు (శనివారం) వేంపల్లెకు రానున్నారు. మధ్యాహ్నం 1గంట నుంచి వేంపల్లెలో రోడ్ షో నిర్వహించనున్నారని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. పులివెందుల రోడ్డులోని ఐటీఐ వద్ద నుంచి నాలుగు రోడ్ల కూడలి, కడప రోడ్డు, సాయిబాబా టెంపుల్, కాపువీధి, పాతపేట, మెయిన్ బజార్, అమ్మవారిశాల వీధి, పాతస్టేట్ బ్యాంకు మీదుగా రోడ్ షో నాలుగురోడ్ల కూడలి వరకు జరుగుతుందన్నారు. అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఆర్ఓ వెంకటేశులు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆర్వో వెంకటేశులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్ఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా 301 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో 181 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, 120 పోలింగ్ కేంద్రాల్లో వీడియోలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందన్నారు. వృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్ అందుబాటులో ఉంచామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే వాటిని సరిచేసేందుకు సెక్టార్ ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆవోపా సభ్యులు

వేంపల్లె : ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (ఆవోపా) మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అక్షయ తృతీయ సందర్భంగా చల్లని మజ్జిగ, నీటిని పంపిణీ చేశారు.పట్టణంలోని బస్టాండు ఆవరణలో వేచి ఉండే ప్రయాణికులకు, పాదచారులకు దాతల సహకారంతో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశామని ఆవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకట సునీల్ కుమార్, ఉపాధ్యక్షుడు రాయవరం ద్వారకనాథ్, ఆవోపా మహిళా విభాగ్ అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ్ కిషోర్ తెలిపారు. వేసవికాలంలో తాగునీరు, మజ్జిగ దానం చేయడం అత్యంత పుణ్యకార్యమని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నషాన్



నషాన్ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలోగల చారిత్రాత్మక చాంద్ ఫిరా గుంబద్ దర్గా నషాన్ ఉత్సవాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుండి గంధాన్ని ఫకీర్ల మేళతాళాలతో దర్గా వద్దకు తీసుకువచ్చి ఫాతేహా చేసి గురువుల మజార్‌పై గంధాన్ని సమర్పించారు. అలాగే దర్గా ఆవరణంలో ఉన్న జెండా దగ్గర నషాన్ ఉత్సవం నిర్వహించారు.

హాయిహాయిలే అలా..

- సుందరంగా గ్రామీణ రహదారులు
- కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణాలు



పులివెందుల: గ్రామీణ ప్రాంతంలో వేసిన సీసీరోడ్లు

పులివెందుల రూరల్ / వేంపల్లె : ఇక రయ్‌రయ్ మంటూ ప్రయాణం సాఫీగా సాగిపోతోంది.అతుకులు, గతుకుల రోడ్ల కష్టాలు తీరిపోయాయి. బండెక్కితే హాయిగా ముందుకు సాగిపోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను అందంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసింది. గత ప్రభుత్వాల హయాంలో గతుకుల రోడ్లతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లకు మహర్దశ ఏర్పడింది. పులివెందుల నియోజకవర్గంలోని పులివెందుల, సింహాద్రిపురం, చక్రాయపేట, వేంపల్లె మండలాల్లోని బలపనూరు, కె.రాజుపల్లె, కుప్పం, పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో, గ్రామాల్లో సీసీరోడ్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని అలవలపాడు రహదారి 1 కిలోమీటరు వరకు, వేంపల్లె, బలపనూరు, సింహాద్రిపురం గ్రామాల్లో సుమారు 4 కిలోమీటర్ల పొడుగునా రోడ్లు వేశారు. సింహాద్రిపురం మండల వ్యాప్తంగా 13.2 కిలోమీటర్లు సీసీ రోడ్లు వేశారు. దాదాపు రూ.15.32 కోట్లు నిధులు వెచ్చించారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా మండలాలు, గ్రామాల్లో సుమారు రూ.30కోట్లు వెచ్చించి రహదారులను ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేసి పల్లె ప్రగతికి బాటలు వేసింది.

గ్రామీణ రోడ్లకు మోక్షం

వేంపల్లె మండలంలో నందిపల్లె నుంచి పాములూరు గ్రామం వరకు రూ.58లక్షలతో సిమెంట్ రోడ్డు, నందిపల్లె గ్రామం నుంచి కుప్పాలపల్లె గ్రామం వరకు రూ.1.80కోట్లతో మట్టి రోడ్డు, చింతలమడుగుపల్లె గ్రామం నుంచి నేలవరంతాండా వరకు రూ.2.70కోట్లతో తారురోడ్డులను నిర్మించారు. అలాగే బక్కన్నగారిపల్లె, టి.వెలమవారిపల్లె, తాళ్లపల్లె, అయ్యవారిపల్లె, తదితర గ్రామాల్లో 5.2కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉన్న రోడ్లను పాడా నిధుల కింద నిధులు మంజూరు చేసి సిమెంటు రోడ్లు, బీటీ రోడ్లు వేశారు. రహదారి కష్టాలు తలగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాడు



వేంపల్లె: టీడీపీ హయాంలో ఇలా

నేడు



వైఎస్సార్‌సీపీ హయాంలో



వేంపల్లె: టీడీపీ హయాంలో ఇలా



నందిపల్లె నుంచి కుప్పాలపల్లెకు బీటీ రోడ్డు

గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం



గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రస్తుతం రూ. కోట్ల నిధులు వెచ్చించి సీసీ రోడ్లను ఏర్పాటు చేసింది. ఇకపై హాయిగా, సుఖవంగా ప్రయాణం సాగించవచ్చు.

రవీంద్రనాథరెడ్డి, గురిజాల

చాలా ఇబ్బందులు తీరాయి



ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించడంతో చాలా వరకు ఇబ్బందులు తీరాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రోడ్లను పట్టించుకోకపోవడంతో దారుణంగా తయారయ్యాయి. ఏ గ్రామానికి వెళ్లినా గుంతలు, గతుకుల రోడ్లు దర్శనమిచ్చేవి. దీంతో గ్రామాలకు వెళ్లాలంటేనే ఇబ్బందులు పడేవాళ్లం. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో పాడా నిధులు విడుదల చేసి గ్రామీణ ప్రాంతాలకు తారురోడ్లు వేశారు. – **శ్రీకాంత్‌రెడ్డి, నందిపల్లి గ్రామం**

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి



తక్కలపల్లి హరిజనవాడలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వృద్ధుడిని కోరుతున్న వైఎస్ రాహుల్‌రెడ్డి

చక్రాయపేట : జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే మనందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వస్తాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తనయుడు వైఎస్ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రబొమ్మనపల్లి గ్రామం సిద్దారెడ్డిగారిపల్లె, తక్కలపల్లి హరిజనవాడ, గడ్డంవారిపల్లె హరిజనవాడలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జగనన్నను, అవినాష్ అన్నను గెలిస్తే మన రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఉన్న పథకాలన్నీ ఆగిపోతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ కొండారెడ్డి అల్లుడు నితిన్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు శేషారెడ్డి, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, నేతలు రఘునాథరెడ్డి, భయ్యారెడ్డి రెడ్డివాసుదేవరెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, సూరి, జయచంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శివారెడ్డి, భయ్యారెడ్డి సుబ్బిరెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ప్రతి ఇంటి వద్ద రాహుల్‌రెడ్డిని ఘనంగా స్వాగతించారు.

జగనన్నను భారీ మెజార్టీతో గెలిపించండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఇంతియాజ్

పులివెందుల రూరల్ : వికలాంగుల సంక్షేమ సారధి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఇంతియాజ్ అన్నారు. శుక్రవారం పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, పేదవర్గాలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు దృష్టిలో ఉంచుకొని వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను అధికారంలోకి తెచ్చేందుకు దివ్యాంగులందరు సైనికుల్లా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో 30లక్షల మంది పైగా దివ్యాంగులు జగనన్నకు బాసటగా నిలవాలన్నారు. అదేవిధంగా కడప జిల్లాలోని 25వేలకుపైగా ఉన్న దివ్యాంగులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు అందించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. 14 సంవత్సరాలు పరిపాలనలో ఉన్న చంద్రబాబునాయుడు వికలాంగుల సంక్షేమం కోసం ఏం చేశారో అందరికీ తెలుసన్నారు. మాదిగ జాతికి ద్రోహం చేసి రోజుకు ఒక మాట మాట్లాడే ఎమ్మార్పీసీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వికలాంగుల హక్కుల పోరాట సమితి బీహెచ్‌పీఎస్ అనే ఒక సంస్థ పేరుతో వికలాంగులను రెచ్చగొట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారన్నారు. ఎల్లో మీడియా సహకారంతో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని ఏకైక ఎజెండాతో తప్పుడు మాటలు మాట్లాడడం సరికాదన్నారు. దివ్యాంగులకు అన్ని విధాలా అండగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, చాగంటి భాస్కర్‌రెడ్డి, కృష్ణంగారిపల్లె బ్రహ్మానందరెడ్డి, సాయికుమార్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

యువతకు సామాజిక స్పృహ ఉండాలి

కడప కల్చరల్ : యువతకు ఆధ్యాత్మిక, సామాజిక స్పృహ ఉండాలని, యుక్త వయస్సులో దారి తప్పకుండా సరైన బాటను ఎంచుకుంటే జీవితం ఆనందమయంగా సాగుతుందని ఫాదర్ ఏసు వరప్రసాద్, కడప మేత్రాసన కోశాధికారి ఫాదర్ పెండ్లికట్ల దేవదాసు అన్నారు. శుక్రవారం నగర శివార్లలోని రామాంజనేయపురం పాస్టరల్ సెంటర్ లో కడప డీన్ పరిధి లోని కథోలిక యువతీ యువకులకు వివాహ వ్యవస్థపై శిక్షణా తరగతులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెళ్లికి ముందు ప్రేమ కంటే పెళ్లి తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకుని ప్రేమగా జీవించడమే ముఖ్యమన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వేంపల్లె : పార్టీలో చేరిన వారితో సతీష్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి



చక్రాయపేట : వైఎస్ఆర్‌సీపీలో చేరిన వారితో వైఎస్ కొండారెడ్డి

వేంపల్లె : స్థానిక జెండామాను వీధిలో టీడీపీ నుంచి దాదాపు 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. శుక్రవారం శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు సమక్షంలో వీరు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. జెండామాను వీధికి చెందిన తాజుద్దీన్, మాబాషా, గోసుల్ల, దస్తగిరి, రహమతుల్లా, బాబు షరీఫ్, ఇబ్రహీం, రిహాన్, మస్తాన్, షఫీ, నందాని, వాహిద్, ఖలీల్, అక్బర్, అబ్దుల్ ఖాదర్, ముబారక్, మౌలా, సులేమాన్, ఈసుబ్‌లతో పాటు 60 కుటుంబాల వారికి సతీష్‌కుమార్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డిలు పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి తావు లేకుండా.. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అంతేకాకుండా విద్య, వైద్యంకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ షబ్బీర్‌వల్లి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబాషరీఫ్, రామచంద్రారెడ్డి, నాగసుబ్బారెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి, మునీర్‌బాషా, పాల్గొన్నారు.

చక్రాయపేట మండలంలో..

చక్రాయపేట : మండలంలోని ఎర్రబొమ్మనపల్లె గ్రామం సిద్దారెడ్డిపల్లెకు చెందిన పలు వురు బీసీ లు శుక్రవారం మండల ఇన్‌చార్జి వైఎస్ కొండా రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. సిద్దారెడ్డి పల్లెకు చెందిన బత్తలశ్రీరాములు, బత్తల రవికుమార్, గంగాధర్, గంగన్న, అమరనాథ్, వేంపల్లె రవి, పోలిమేని దివాకర్ గ్రామ సర్పంచ్ మేకల లక్షుమయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి వైఎస్ కొండారెడ్డి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న గెలుపునకు కష్టపడి పని చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, పార్టీ నేత జనార్దనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఆధ్యాత్మిక శిబిరం

కడప కల్చరల్ : విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పిరమిడ్ స్పిరిచ్యువల్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు పిరమిడ్ ధ్యాన కేంద్రంలో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభమైంది. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింతన పెంచేందుకు సొసైటీ అధ్యక్షులు ప్రొఫెసర్ జీవీ శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఊర్మిల ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ధ్యానం, యోగా, చిత్రలేఖనం, సంగీతం, భగవద్గీత పఠనం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. బాలల్లోని సృజనాత్మక శక్తిని వెలిసితీసి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసే దిశగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సొసైటీప్రతినిధులు తెలిపారు.

రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలి



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా పోటీచేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని డిష్ వెంకటరెడ్డి, పాపయ్య యాదవ్‌లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో మహిళలకు డెమో ఈవీఎంలపై ఓటు వేసే విధానాన్ని చేసి చూపించారు. ఈవీఎంలో మొదటి వరుసలో ఉన్న ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని వారు సూచించారు. రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

శిక్షణా శిబిరాలతో బాలల్లో మానసిక వికాసం



చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈఓ అనూరాధ

కడప కల్చరల్ : శిక్షణా శిబిరాలతో విద్యార్థుల్లో మానసిక వికాసం జరిగే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ అన్నారు. కడప బాలోత్సవం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ (మెయిన్) హైస్కూలులో నిర్వహించిన చిత్రలేఖనం, అభ్యుదయ గీతాల శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలల్లోని ఆసక్తులను గుర్తించి తగిన శిక్షణను ఇస్తే కొత్త శక్తిని పుంజుకుని విద్యల్లో రాణిస్తారని, బహుముఖ ప్రజ్ఞ చూపగలరన్నారు. డాక్టర్ ఓబుల్ రెడ్డి పిల్లలు సెల్ ఫోన్‌కు, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బాలోత్సవం ప్రతినిధులు నాగముని రెడ్డి, జి.గోపాల్, రాజశేఖర్ రాహుల్, లక్ష్మిరాజ, విజయకుమార్, మహేష్, అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.

ఐదేళ్లు.. అభివృద్ధి పరవళ్లు



టీడీపీ మోసపూరిత హామీలకు దర్శనమిస్తున్న షాదీఖానా బోర్డు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి కావస్తున్న షాదీఖానా నిర్మాణ పనులు



చిల్డ్రన్స్ ఎక్విప్‌మెంటుతో కూడిన వైఎస్సార్ మెమోరియల్ పార్కు

- ప్రగతి పథంలో సింహాద్రిపురం
- ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు
- నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు

సింహాద్రిపురం : పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. మండలంలో గత 30 ఏళ్లలో అభివృద్ధి ఓ లెక్క... ఐదేళ్ల కాలంలో ప్రస్తుత ప్రభుత్వ పనితీరుతో గ్రామాలు ప్రగతి బాట పట్టాయి. మండలంలో రూ.602కోట్లతో ప్రధాన రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల విస్తరణ, గ్రామీణ ప్రాంతాలకు లింకురోడ్లు, ఆలయాలు, పార్కుల పనులు పూర్తి చేశారు.

ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త రూపం

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల రూపురేఖలు మారాయి. మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్లకు సంబంధించి రూ.8.35కోట్ల వ్యయంతో నూతన భవనాలను ఏర్పాటు చేశారు. అలాగే చిల్డ్రన్స్ ఎక్విప్‌మెంటుతో కూడిన వైఎస్సార్ మెమోరియల్ పార్కును ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. రూ.11.35కోట్లతో ప్రధాన రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులు చేశారు. అలాగే గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు నూతన భవనాలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలను అందిస్తున్నారు.

సంక్షేమ పథకాలతో పదివేల కుటుంబాలకు లబ్ధి

సింహాద్రిపురం మండలంలో మొత్తం 10712 కుటుంబాలు ఉన్నాయి.అందులో 10315 కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరింది. అలాగే డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా వేలాది మందికి కోట్లాది రూపాయలు అందించారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా సింహాద్రిపురం మండలంలోని ప్రధాన పాఠశాలలతో పాటు గ్రామాల్లోని పాఠశాలల రూపురేఖలు మారాయి. ముఖ్యంగా పాఠశాలల భవనాలకు కొత్తరూపం తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. మండలంలో రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్‌తో పాటు జలకళ పథకం ద్వారా రైతులకు సాగునీటి బోర్లు వేయించి రైతులు ఏడాదికి మూడు పంటలు సాగు చేసుకునే భరోసా కల్పించింది. పార్నపల్లి సీబీఆర్ డ్యాంలో 10టీఎంసీలు, పైడిపాలెం రిజర్వాయర్‌లో 6 టీఎంసీల నీటిని నిల్వ చేసి రైతులకు సాగునీటి సమస్య లేకుండా చేసింది. దీంతో సింహాద్రిపురం తొండూరు మండలాల రైతులు పంటలు సాగు చేసుకునేందుకు మార్గం సగమమైంది. అంతేగాక గ్రామాల్లో సీసీరోడ్లు, స్మశాన వాటికల రూపురేఖలను కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్చింది.

అన్ని వర్గాల ప్రజలకు మేలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటే అన్ని వర్గాల ప్రజలకు మంచి జరుగుతుంది. గత 30ళ్లలో మండలంలో జరగని అభివృద్ధి.. కేవలం 5ఏళ్లలో చేసి చూపించింది. ఇచ్చిన హామీలు నెరవేర్చే నైజం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలది. ముస్లిం సోదరులకు షాదీఖానా వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కట్టిస్తాం. హామీ ప్రకారం షాదీఖానా నిర్మించి ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీ ఏ ఒక్కటి నెరవేర్చలేదు. ముస్లిం సోదరులకు సాదీఖానా కట్టిస్తామని బోర్డులకు మాత్రమే పరిమితమైంది. మాట తప్పింది. మళ్లీ ఇప్పుడు అదే మోసాలకు అసాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెట్టడానికి చూస్తోంది. నమ్మొద్దు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలి. సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

గండ్లూరి వీరశివారెడ్డి, ఎన్నికల పరిశీలకులు